



# కరపత్రం

SINCE 2014

శనివారం జనవరి 11 2025 | సంపుటి :0 | సంచిక : 90 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్‌లు



హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖ-సికింద్రాబాద్-విశాఖ (20833/20834) మధ్య రాకపోకలు సాగిస్తోన్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కు అదనంగా కోచ్‌లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు 16 కోచ్‌లతో నడుస్తోన్న విశాఖ-సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో అదనంగా మరో 4 కోచ్‌లను జత చేసింది. అదనపు కోచ్‌లు జనవరి 11 నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. మరో 4 కోచ్‌లు పెంచడం ద్వారా ప్రస్తుతం 1,128గా ఉన్న సీటింగ్ కెపాసిటీ 1,414కి చేరనుంది.

నాలుగు కోచ్‌లు అదనంగా జత చేశాక ఛైర్‌కార్ బోగీల సంఖ్య 14 నుంచి 18కి పెరిగింది. సీటింగ్ కెపాసిటీ 1,024 నుంచి 1,336కు చేరుకుంది. ప్రస్తుతం ఉన్న రెండు ఎగ్జిక్యూటివ్ క్లాస్ బోగీల సంఖ్యలో ఎలాంటి మార్పు చేయలేదు. ఈ రెండు బోగీల్లో 104 మంది ప్రయాణం చేయొచ్చు. దీంతో మొత్తం సీటింగ్ కెపాసిటీ 1,414కి చేరినట్లు అయింది.


## హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్.. 23 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు



2లో

- సైబర్ నేరగాళ్ల కోసం హైదరాబాద్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు.
- ఏపీ, కర్ణాటక, యూపీ, గుజరాత్ రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు.
- వీరిపై తెలంగాణలో 30, దేశవ్యాప్తంగా 328 కేసులు నమోదయ్యాయి.
- నిందితుల నుంచి సెల్‌ఫోన్లు, చెక్‌బుక్‌లు, సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

# ఇతర దేశాల్లోని నగరాలకు పోటీనిచ్చేలా ఫ్యూచర్ సిటీ: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రాన్ని రైజింగ్ తెలంగాణగా అభివృద్ధి చేయడమే తన కల అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హైటెక్ సిటీలోని సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్‌లో సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ.. ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇతర దేశాల్లోని నగరాలతో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.

“3,200 ఈవీ బస్సులను ఆర్టీసీలోకి తీసుకువస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించాం. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి హైదరాబాద్ సిద్ధమవుతోంది. వరదలు లేని నగరంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ను అనుసంధానించే రేడియల్ రోడ్లు నిర్మించబోతున్నాం. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం తయారీ రంగానికి కేంద్రంగా ఉండబోతుంది. నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాం. రాష్ట్రానికి తీరప్రాంతం లేదు.. అందుకే డ్రైపోర్టు ఏర్పాటు చేయనున్నాం. పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో కంపెనీలు కలిసి వస్తే అద్భుతాలు సృష్టించవచ్చు” అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని.. ప్రేమ జంట బలవన్మరణం



సింగూరు ప్రాజెక్టు సమీపంలో ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది.

సంగారెడ్డి: సింగూరు ప్రాజెక్టు సమీపంలో ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఎస్ఐ రాజేశ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి వద్ద హరిత రెస్టారంట్‌లో నిన్న మధ్యాహ్నం ప్రేమ జంట గదిని అద్దెకు తీసుకుంది. శుక్రవారం గది ఖాళీ చేయాల్సి ఉండగా వారు బయటకు రాకపోవడంతో సిబ్బంది కిటికీలు బద్దలుకొట్టి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వారి తల్లిదండ్రులకు సమాచారమందించారు. మృతులను నారాయణఖేడ్ మండలం నారాయణపేట గ్రామానికి చెందిన ఉదయ్ (20), అదే గ్రామానికి చెందిన యువతిగా గుర్తించారు. ఇరువురి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని, ఆ మనస్తాపంతోనే ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

## మాజీ మంత్రి కేటీఆర్‌పై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు



హైదరాబాద్: మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదైంది. నిన్న ఏసీబీ విచారణ అనంతరం బంజారాహిల్స్‌లోని భారాస కార్యాలయం వరకు అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారని ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేశారు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేటీఆర్‌తో పాటు గెల్లు శ్రీనివాస్, బాల్క సుమన్, మన్నె గోవర్ధన్, క్రిశాంక్, జైసింహ తదితరులపై 305, r/w 62 BNS సెక్షన్ల కింద కేసు నమోదైంది.

## హరీశ్‌రావును అరెస్టు చేయొద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు



హైదరాబాద్: తనపై పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. కౌంటరు దాఖలు చేయాలని ప్రతివాది చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీ చేసిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది. అప్పటి వరకు హరీశ్‌రావును అరెస్టు చేయొద్దంటూ గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన



2లో

హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థులను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు.

నల్లగొండ - వరంగల్ - ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా పులి సరోత్తమ్ రెడ్డి, కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిగా మల్కా కొమరయ్య, కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సి అంజిరెడ్డిని ఎంపిక చేసినట్టు కిషన్ రెడ్డి ప్రకటించారు.

## ఏం మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నారు.. వికారాబాద్ కలెక్టర్ తీరుపై హరీశ్‌రావు ఆగ్రహం..




సీఎం రేవంత్ రెడ్డి అన్న అనుముల తిరుపతి రెడ్డికి స్కూల్ పిల్లల పరేడ్‌తో స్వాగతం పలికించిన వికారాబాద్ కలెక్టర్ తీరును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఎన్నో ఉన్నత చదువులు చదువుకొని, ఎన్నో త్యాగాలు చేసి వచ్చే అఖిల భారత సర్వీస్ అధికారులు ప్రజాసేవలో తమ పరిణతిని, బుద్ధి కుశలతను ప్రదర్శించాలని సూచించారు. అప్పుడే ప్రజల్లో అధికారుల పట్ల గౌరవ భావం ఏర్పడుతుందని తెలిపారు. భారత జాతీయ చిహ్నం మూడు సింహాలు తలెత్తుకొని ప్రజల పట్ల మనకుండే బాధ్యతను గుర్తు చేస్తాయని అన్నారు. ప్రభుత్వాలు వస్తాయి పోతాయి.. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని అధికారులు తెలుసుకోవాలని సూచించారు.

వికారాబాద్ కలెక్టర్‌గా పని చేస్తున్న ప్రతీక్ జైన్ గతంలో రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా ఎంతో మంచి పేరున్న నిక్కచ్చి అధికారిగా పని చేశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ తలవంచి దండాలు పెట్టడం.. అర్హత లేని, కనీసం ప్రజలతో వార్డ్ నెంబర్‌గా కూడా ఎన్నుకోబడని వ్యక్తులను రెడ్ కార్పెట్ వేసి తనతో తీసుకెళ్తూ చదువుకునే చిన్నారులతో సెల్యూట్లు చేయించటం ఇది దేనికి చిహ్నమని ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారుల పనితీరును పర్యవేక్షించే DoPT ఇది గమనించటం లేదా అని నిలదీశారు.

కాంగ్రెస్ పార్టీని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ ముఖ్యమంత్రి కుటుంబ పాలన చేయటం ప్రజలు చూస్తూనే ఉన్నారని హరీశ్‌రావు అన్నారు. ఒక ఐఏఎస్ అధికారిగా ఆ చిన్నారులకు మీరేం సందేశం ఇవ్వదలచుకున్నారని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అన్నకు, సీఎం కుటుంబసభ్యులకు ఇలా రాచ మర్యాదలతో స్వాగతం పలకాలని ఏ చట్టం చెబుతుందని ప్రశ్నించారు. కుటుంబపాలన చేస్తూ అక్రమ కేసులతో పైశాచికానందాన్ని పొందుతున్న అబద్ధాల సీఎం రోజులు దగ్గర పడ్డాయని వ్యాఖ్యానించారు.

## సంక్రాంతి సందడి.. హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ



తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. సొంత ఊరిలో సంక్రాంతి పండుగను బంధుమిత్రులతో కలిసి జరుపుకొనేందుకు సొంత వాహనాల్లో బయలుదేరడంతో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. తెలంగాణలో శనివారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలతో కలిసి కుటుంబ సభ్యులంతా కార్లు, ఇతర వాహనాల్లో బయలు దేరారు. దీంతో వేలాది వాహనాలు ఒక్కసారిగా రోడ్డెక్కాయి. చౌటుప్పల్ పట్టణంలో ఫ్లైఓవర్ లేకపోవడంతో స్థానిక పాదచారులు, ద్విచక్ర వాహనదారులు జాతీయ రహదారిని దాటే సమయంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

మరో వైపు పంతంగి టోల్ ప్లాజా వద్ద కొన్ని నిమిషాల పాటు వాహనాలు నిలిచిపోతున్నాయి. ఈ టోల్ ప్లాజా వద్ద విజయవాడ వైపు సాధారణంగా 8 టోల్ బూత్‌లు తెరిచి ఉంటాయి. రద్దీని దృష్టిలో పెట్టుకొని అదనంగా మరో రెండు బూత్ లను తెరిచి ఉంచారు. ఒక్కో వాహనం క్షణాల వ్యవధిలోనే టోల్ బూత్ దాటి వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. చౌటుప్పల్ పట్టణంలో, పంతంగి టోల్ ప్లాజా వద్ద 50 మంది ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రయాణికులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశారు.

# నేనూ మనిషినే.. పొరపాట్లు జరుగుతాయ్:

# మోదీ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ

జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తానూ మనిషినేనని, దేవుడిని కాదంటూ గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తుచేసుకున్నారు.

ఇంటర్నెట్ డెస్క్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తోన్న పాడ్‌కాస్ట్‌లో అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరిద్దరూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను నిఖిల్ కామత్ తన యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేశారు. అంతకుముందు ట్రైలర్‌ను మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. అందులో ప్రధాని (%ూవీ వీశీఁఱ%) గతంలో చేసిన వ్యాఖ్యలను వీరు గుర్తుచేసుకున్నారు. తానూ మనిషినేనని, పొరపాట్లు జరుగుతాయని మోదీ అన్నారు.

%తొలుత ఈ వీడియో ట్రైలర్‌ను పోస్ట్ చేసిన నిఖిల్ కామత్.. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే పూర్తి వీడియోను విడుదల చేశారు. దాదాపు 2 గంటల పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రాజకీయాలు, వ్యవస్థాపకత, నాయకత్వ సవాళ్లు వంటి పలు అంశాలపై వీరిద్దరూ చర్చించుకున్నారు. ఆరంభంలో నిఖిల్ కామత్ మాట్లాడుతూ.. 'ప్రధానిని ఇంటర్వ్యూ చేస్తున్నానంటే ఒకింత భయంగా ఉంది' అని అన్నారు. దీనికి మోదీ బదులిస్తూ.. 'ఇదే నా తొలి పాడ్‌కాస్ట్. దీన్ని ప్రజలు ఎలా స్వీకరిస్తారో తెలియదు మరి' అనడంతో నవ్వులు విరిశాయి.

ఉచితాలు మనమూ ఇద్దాం.. భాజపా మ్యానిఫెస్టో కమిటీ సిఫార్సు

రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మీరిచ్చే సూచన ఏంటీ? అని నిఖిల్ కామత్ ప్రధానిని అడగ్గా.. "రాజనీతి కలిగిన వ్యక్తులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది. ప్రజాసేవ చేయాలన్న మిషన్ తీసుకోవడం కోసం రావాలి.. సొంత లక్ష్యాలు



నెరవేర్చుకోవడం కోసం కాదు" అని సమాధానమిచ్చారు. ఈసందర్భంగా మోదీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన పాత ప్రసంగాల గురించి మాట్లాడుతూ.. "అప్పుడు నేనే ఏదో అని ఉంటాను. పొరపాట్లు జరుగుతుంటాయి. నేనూ మనిషినే.. భగవంతుడిని కాదు కదా..!" అని వ్యాఖ్యానించారు. తొలి రెండు పర్యాయాలు ప్రధానిగా తన అనుభవాలను మోదీ పంచుకున్నారు.

## రెండేళ్లలో 50 అమృత్ భారత్ రైళ్ల తయారీ: అశ్వనీ వైష్ణవ్



చెన్నై: రాబోయే రెండేళ్లలో చెన్నైలోని కోచ్ ఫ్యాక్టరీలో 50 అమృత్ భారత్ రైళ్లను తయారు చేయనున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడించారు. అమృత్‌భారత్ వెర్షన్ 2.0 రైళ్లలో కొత్తగా 12 రకాల మార్పులు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ సుబ్బారావుతో కలిసి శుక్రవారం కోచ్ ఫ్యాక్టరీని సందర్శించారు. అమృత్ భారత్ రైళ్లతో పాటు, వందేభారత్ 2.0 స్లీపర్ రైళ్ల తయారీని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

2024 జనవరిలో అమృత్ భారత్ వెర్షన్ 1.0ను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని మంత్రి తెలిపారు. ఏడాదిలో వచ్చిన స్పందన ఆధారంగా వెర్షన్ 2.0ను తీర్చిదిద్దినట్లు చెప్పారు. కొత్తగా 12 రకాల ఫీచర్లను జోడించినట్లు తెలిపారు. సెమీ ఆటోమేటిక్ కప్లెట్స్, మాడ్యులర్ టాయిలెట్స్, ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ ఫీచర్, ఎమర్జెన్సీ బ్రేక్ సిస్టమ్, వందే భారత్ రైళ్ల తరహాలో నిరంతరం వెలిగే లైట్లు, ఛార్జింగ్ పోర్టులతో పాటు బెర్తుల డిజైన్ కూడా మార్చినట్లు వెల్లడించారు. ప్యాంట్రీ కారును సమూలంగా మార్చినట్లు తెలిపారు. పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాల లక్ష్యంగా ఈ రైళ్లను తీసుకొచ్చామని, తక్కువ ఖర్చుతో దూర ప్రాంతాలకు వెళ్లే వారికి మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని అందించడమే తమ లక్ష్యమని వివరించారు. అమృత్ భారత్ రైళ్లలో చేపడుతున్న మార్పుల గురించి ఎక్స్‌లో ఓ థ్రెడ్‌ను కూడా మంత్రి పోస్ట్ చేశారు.

## పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి బెయిల్



పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. పుణె: పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో పుణె కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2023 మార్చిలో లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వి.డి సావర్కర్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో రాహుల్‌పై సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్ పుణెలోని ఓ కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేసిన విషయం తెలిసిందే.దిల్లీ ఎన్నికలు.. ప్రచారంలో 'ఉచితాలదే' పైచేయి! ఈ కేసుకు సంబంధించి తాజా విచారణకు రాహుల్ గాంధీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. దీంతో ఆయనకు రూ.25వేల పూచీకత్తు బాండ్‌పై ఎంపీ/ఎమ్మెల్యే న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీకి పూచీకత్తుగా కాంగ్రెస్ సీనియర్ నేత మోహన్ కోర్టు ముందు హాజరయ్యారు. మరోవైపు, ఈ కేసులో రాహుల్ హాజరు విషయంలో న్యాయస్థానం శాశ్వత మినహాయింపు కల్పించిందని ఆయన తరఫు న్యాయవాది మిలింద్ పవార్ వెల్లడించారు. ఈ అంశంపై తదుపరి విచారణ ఫిబ్రవరి 18కి వాయిదా పడినట్లు తెలిపారు.

## విమర్శలను అలా ఎదుర్కొంటా: పాడ్‌కాస్ట్‌లో వెల్లడించిన ప్రధాని మోదీ



తనపై వచ్చే విమర్శలను ఎలా ఎదుర్కొంటానో ప్రధాని మోదీ ఓ ఉదాహరణ రూపంలో వివరించారు. ప్రముఖ వ్యాపారవేత్త, జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో అతిథిగా విచ్చేసిన ప్రధాని మోదీ వ్యక్తిగతంగా తన అనుభవంలోకి వచ్చిన ఎన్నో విషయాలను వెల్లడించారు. అలాగే తాను విమర్శలను ఎలా ఎదుర్కొంటానో వివరించారు. దానిలో భాగంగా అహ్మదాబాద్ నేపథ్యమున్న ఓ చిన్న కథ చెప్పారు."స్కూటర్ మీద వెళ్తున్న ఓ వ్యక్తి.. అటుగా నడుస్తున్న వ్యక్తిని ఢీకొట్టబోయాడు. దాంతో అతను ఎంత దుర్భాషలాడుతున్నా.. వాహనదారుడు మాత్రం మౌనంగానే ఉండిపోయాడు. అలా ఎలా ఉండగలుగుతున్నారని వాహనదారుడిని అడగ్గా.. 'అతడు నన్ను దూషిస్తున్నాడు తప్పితే.. నా నుంచి ఏమీ తీసుకెళ్లడం లేదని చెప్తాడు" అని మోదీ వివరించారు. రాజకీయాల్లోకి రావాలంటే బాగా డబ్బు ఉండాలా?: చిన్ననాటి కథ చెప్పిన మోదీ విమర్శ అనేది తప్పదు కానీ నిజానికి కట్టుబడి ఉండటం అనేది ముఖ్యమని మోదీ అన్నారు. ప్రజాసేవలో ఉన్న వ్యక్తులకు సున్నితత్వం ఉండాలని, అలాగైతేనే ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేసేందుకు వీలవుతుందని సూచించారు. దురుద్దేశంతో ఎన్నడూ తప్పు చేయకూడదనేది తన జీవిత మంత్రమని తెలిపారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ మూడోసారి 'నో'.. వాళ్లకు మాత్రమే ఈసారి రాసేందుకు ఛాన్స్: సుప్రీంకోర్టు

ఐఐటీల్లో బీటెక్, బీఆర్క్ సీట్ల భర్తీకి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 పరీక్ష మూడు సార్లు రాసుకోవచ్చని చెప్పి ఆ తర్వాత రెండుసార్లుకే పరిమితం చేయడంపై పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇంటర్నెట్ డెస్క్: ఐఐటీల్లో బీటెక్, బీఆర్క్ సీట్ల భర్తీకి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 మూడుసార్లు రాసుకోవచ్చని ప్రకటించి.. ఆ తర్వాత రెండుసార్లకే పరిమితం చేసిన తీరుపై పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై శుక్రవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను రెండుసార్లు రాసేలా జాయింట్ అడ్మిషన్ బోర్డు తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అలాగే, ఐఐటీ కాన్పూర్ ప్రకటన నేపథ్యంలో 2024 నవంబర్ 5-18 తేదీల మధ్య కాలంలో తమ కోర్సుల నుంచి డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులకు ఉపశమనం కలిగించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 పరీక్షకు వారు రిజిస్టర్ చేసుకొనేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపింది.రాజకీయాల్లోకి రావాలంటే బాగా డబ్బు ఉండాలా?: చిన్ననాటి కథ చెప్పిన మోదీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను మూడుసార్లు రాసే అవకాశం కల్పిస్తున్నట్లు నవంబర్ 5న ఐఐటీ కాన్పూర్ నిర్ణయించింది. ఆ తర్వాత 18వ తేదీన జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ) యూటర్న్ తీసుకోవడంతో పలువురు అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. తొలుత చేసిన ప్రకటనతో తాము ఇంజినీరింగ్ కోర్సుల నుంచి తప్పుకొన్నట్లు కొందరు పిటిషనర్లు సుప్రీంకోర్టుకు తెలిపారు. ఆ తర్వాత నిర్ణయం వెనక్కి తీసుకోవడం వల్ల ఆ విద్యార్థులకు కోలుకోలేని నష్టం జరిగినట్లు న్యాయవాదులు కె.పరమేశ్వర్, ఆనందితా మిత్రా వాదించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం.. నవంబర్ 5-18 తేదీల మధ్య కాలంలో కోర్సుల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులకు ఈసారి రిజిస్టర్ చేసుకొనేందుకు అవకాశం కల్పించింది.ఐఐటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి 2013 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ పేరిట పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దానికి ఇంటర్ పాసైన సంవత్సరంతో పాటు ఆ తర్వాత ఏడాది.. అంటే వరుసగా రెండుసార్లు మాత్రమే హాజరు కావొచ్చు. దాన్ని మూడుసార్లకు పెంచుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్ నిర్వహణ బాధ్యత తీసుకున్న ఐఐటీ కాన్పూర్ గతేడాది నవంబర్ 5వ తేదీన ప్రకటించింది. పట్టుమని 15 రోజులు కాకముందే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. దీంతో గతంలో మాదిరిగానే రెండుసార్లు మాత్రమే ఈ పరీక్ష రాసుకోవచ్చు. వచ్చే మే నెలలో జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షకు 2024 మార్చి, 2025 మార్చిలో జరిగే ఇంటర్ లేదా తత్సమానమైన పరీక్షల్లో పాసైనవారు మాత్రమే అర్హులు. అంతకంటే ముందు ఉత్తీర్ణులైనవారికి అవకాశం ఉండదు.

## హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్.. 23 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

మొదటిపేజీ తరువాయి

ఇందుకు సంబంధించిన వివరాలను సైబర్ క్రైమ్ డీసీపీ కవిత వెల్లడించారు. సైబర్ నేరాలు చేస్తున్న ముఠాను యూపీలో పట్టుకున్నట్లు చెప్పారు. 5 ప్రత్యేక బృందాలతో 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరు వివిధ నేరాల్లో మొత్తం రూ.5.29 కోట్లు కాజేశారన్నారు. 5 రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. అక్కడి పోలీసుల సాయంతో అధునాతన సాంకేతికతను వాడి పట్టుకున్నట్లు చెప్పారు. నిందితులు దేశవ్యాప్తంగా ట్రేడింగ్, ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారని వివరించారు. ఈ ముఠాలో ఓ మహిళ కీలకంగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. "3 కేసుల్లో రూ.39 లక్షలు స్వాధీనం చేసుకున్నాం. 70 ఏళ్ల వృద్ధుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఓ మహిళను అరెస్టు చేశాం. ఆమె దిల్లీలో ఎన్జీవో నడుపుతున్నట్లు గుర్తించాం. డబ్బులకు ఆశపడి నిందితురాలు ఎన్జీవో ఖాతాను సైబర్ నేరగాళ్లకు ఇచ్చింది. ఆధారాలను చూపించి ఆమెను అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చాం. ప్రజలు అనుమానిత కాల్స్, మెసేజ్‌లు వస్తే స్పందించకూడదు. వాటికి స్పందిస్తే ఖాతా నుంచి డబ్బులు పోయే ప్రమాదముంది" అని కవిత తెలిపారు.

## ఏం మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నారు.. వికారాబాద్ కలెక్టర్ తీరుపై హరీశ్‌రావు ఆగ్రహం..

మొదటిపేజీ తరువాయి

వికారాబాద్ కలెక్టర్‌గా పని చేస్తున్న ప్రతీక్ జైన్ గతంలో రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా ఎంతో మంచి పేరున్న నిక్కచ్చి అధికారిగా పని చేశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ తలవంచి దండాలు పెట్టడం.. అర్హత లేని, కనీసం ప్రజలతో వార్డ్ మెంబర్‌గా కూడా ఎన్నుకోబడని వ్యక్తులను రెడ్ కార్పెట్ వేసి తనతో తీసుకెళ్తూ చదువుకునే చిన్నారులతో సెల్యూట్లు చేయించటం ఇది దేనికి చిహ్నమని ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారుల పనితీరును పర్యవేక్షించే %ణశీూ% ఇది గమనించటం లేదా అని నిలదీశారు.

కాంగ్రెస్ పార్టీని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ ముఖ్యమంత్రి కుటుంబ పాలన చేయటం ప్రజలు చూస్తూనే ఉన్నారని హరీశ్‌రావు అన్నారు. ఒక ఐఏఎస్ అధికారిగా ఆ చిన్నారులకు మీరేం సందేశం ఇవ్వదలచుకున్నారని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అన్నకు, సీఎం కుటుంబసభ్యులకు ఇలా రాచ మర్యాదలతో స్వాగతం పలకాలని ఏ చట్టం చెబుతుందని ప్రశ్నించారు. కుటుంబపాలన చేస్తూ అక్రమ కేసులతో పైశాచికానందాన్ని పొందుతున్న అబద్ధాల సీఎం రోజులు దగ్గర పడ్డాయని వ్యాఖ్యానించారు.

## తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటన

మొదటిపేజీ తరువాయి

**సరోత్తమ్ రెడ్డి..**

సరోత్తమ్ రెడ్డి వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తి. ప్రధానోపాధ్యాయుడిగా 10 ఏండ్లు, స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా 21 ఏండ్లు పని చేశారు. 2012 నుంచి 2019 దాకా పీఆర్టీయూ జనరల్ సెక్రటరీగా సేవలందించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేశారు సరోత్తమ్ రెడ్డి.

**మల్క కొమరయ్య**

పెద్దపల్లికి చెందిన మల్క కొమరయ్య.. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఈ పట్టా పుచ్చుకున్నారు. పెద్దపల్లి, నిర్మల్, హైదరాబాద్‌లో అనేక విద్యా సంస్థలను నెలకొల్పారు. పల్లవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

**అంజిరెడ్డి**

మెదక్ జిల్లాలోని రామచంద్రాపురానికి చెందిన సీ అంజిరెడ్డి బీఏ పూర్తి చేశారు. పారిశ్రామికవేత్తగా ఎదిగారు. అంజిరెడ్డి భార్య గోదావరి.. సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. గత రెండు దశాబ్దాల నుంచి ఎస్ఆర్ ట్రస్ట్‌ను అంజిరెడ్డి నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సురక్షిత తాగునీటిని అందించేందుకు ఎస్ఆర్ ట్రస్ట్ తోడ్పాటును అందిస్తుంది. అంతేకాకుండా పేద విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.

## గాలి జనార్దన్‌రెడ్డి కేసుల విచారణపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

గాలి జనార్దన్ రెడ్డి ఓఎంసీ కేసుల విచారణను నాలుగు నెలల్లోగా పూర్తి చేయాలని సీబీఐకి సుప్రీం కోర్టు ఆదేశించింది.



దిల్లీ: కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి ఓఎంసీ కేసుల విచారణలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుల విచారణను 4 నెలల్లోగా పూర్తి చేయాలని సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. ఇకపై గడువు పెంచబోయేది లేదని తేల్చి చెప్పింది. వీటి విచారణ 4 నెలల్లో పూర్తి చేయాలని సెప్టెంబరు 30నే సుప్రీం ధర్మాసనం ఆదేశించినప్పటికీ విచారణ పూర్తి కాలేదు. దీంతో మరింత గడువు కోరుతూ మరోసారి సర్వోన్నత న్యాయస్థానాన్ని సీబీఐ ఆశ్రయించింది.కొన్ని హైకోర్టుల తీరు ఆందోళనకరం సీబీఐ అభ్యర్థనపై జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. గాలి సోదరుల కేసుల విచారణలో తీవ్ర జాప్యంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసుల విచారణకు మరో నాలుగు నెలలు గడువు పొడిగించింది. ఇదే చివరి గడువు అని.. ఇకపై పెంచబోయేది లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అక్రమంగా మైనింగ్ చేశారని 2011లో గాలి సోదరులపై సీబీఐ కేసు నమోదైన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసి 13 ఏళ్లయినా సీబీఐ విచారణ ఇప్పటికీ కొలిక్కి రాలేదు.

# కోరుట్ల శిశు మందిర్ లో సంక్రాంతి వేడుకలు

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

కోరుట్ల పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు..సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు.ముందుగా అధ్యాపకులు కమిటీ సభ్యులు భోగిమంటలు వేసి, పాలు పొంగించి సంక్రాంతి పండుగను ప్రారంభించారు.విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో నృత్యం చేశారు.హై స్కూల్ విద్యార్థినులు ముగ్గులతో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ముగ్గుల పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానం కూడా చేయడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహిస్తామని మరియు విద్యార్థులకు పండుగ యొక్క



విశిష్టతను మరియు కుటుంబ సభ్యులతో మూడు రోజులపాటు జరుపుకునే గొప్ప పండుగ అని విద్యార్థులకు వివరించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీ గోపు వెంకటేష్ మరియు అధ్యాపకులు, మాతాజీలు కమిటీ సభ్యులు.పాల్గొనడం జరిగింది.



# ఘనంగా మెట్టుపల్లి లోముక్కోటి ఏకాదశి వేడుకలు.

**... దేవాలయాలలో పోటెత్తిన భక్తులు.**

**కరపత్రం మెట్ పల్లి, జనవరి 10.**

జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా వివిధ దేవాలయాలలో భక్తులు పోటెత్తారు. ఉదయం నాలుగు గంటల నుండి భక్తులు వెంకటేశ్వర స్వామి దేవాలయం, చెన్నకేశవ నాథ దేవాలయానికి , కోదండ రామాలయంలో పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారా దర్శనం చేస్తే కలిగే పుణ్యఫలం గురించి పురోహితులు మారుతి శర్మ వివరించారు. ఈ సందర్భంగా మారుతి శర్మ మాట్లాడుతూ అనంతమైన పుణ్యఫలం అని చెప్పుకోవాలి. భారతీయులు కాంతిని ఆరాధించేటటువంటి వారు. ప్రాఙ్ముఖంగా ప్రయాణించేటటువంటి వారు. దేహంలో ఎప్పుడూ కూడా ఎడమ భాగాన్ని కుడి భాగం నియంత్రిస్తూ ఉంటుంది. వామ భాగం స్త్రీ సంబంధితమైనటువంటి భాగం అని తెలిపారు.ప్రేమ, పారమార్థిక దృష్టి, లౌకిక సుఖములు, ఆనందములు ఇవన్నీ కూడా ఉత్తర దిక్భాగంలో ఉంటాయి. వీటన్నింటినీ నియంత్రించేది ఎడమ భాగం. అలాగే మన దృష్టి కూడా నిరంతరం ఎడమ వైపుకే ప్రసరిస్తూ ఉంటుంది. ఉత్తర దిక్కుకు ధనము, సంపద వంటి వాటికి ప్రాముఖ్యత ఉంటుందని అన్నారు. అన్నింటికంటే మించి ఈ విశాల విశ్వమంతా కూడా తన చుట్టూ తానూ తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతుంది అనుకుంటే ఈ విశ్వంలో ఉండే అంతర్భాగము ఆక్సిల్ అంటారు. దానిని అది దీనికి వ్యతిరేకంగా తిరుగుతూ ఉంటుంది.



ఈ విశ్వము దక్షిణం వైపునుంచి ఉత్తరం వైపుకు తిరుగుతూండగా అందులోని అంతర్భాగం ఉత్తరం వైపునుంచి దక్షిణానికి తిరుగుతుందని అన్నారు. "ప్రాగ్ ఆరభ్య దక్షిణేణ వర్తనం" మన హిందూ ధర్మంలో అందుకోసమే ఆలయానికి వెళ్తే ప్రదక్షిణ చేయాలి – ప్రాగ్ ఆరభ్య దక్షిణేన వర్తనం. ఉత్తరంగా, ఈశాన్యంగా, తూర్పుగా, ఆగ్నేయం, దక్షిణం ఇలా ప్రదక్షిణ చేస్తూ ఉంటాం. కనుక ఈ రెండింటి మధ్య ఉండే వైరుధ్యం వల్ల కలిగిన ఆకర్షణ శక్తి చేత మనం ఈ భూమిమీద అంటిపెట్టుకొని ఉన్నాం అని వివరించారు. దానికే భూమ్యాకర్షణ శక్తి అని పేరు కూడా ఉందన్నారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర దిగ్భాగ మార్గాన్ని అనుసరించి ఇంక రెండు మూడు రోజులలో సూర్యనారాయణ మూర్తి ఉత్తర దిగ్భాగంలో ప్రయాణం చేస్తూంటాడు. ఈరోజున మనం ఉత్తర దిగ్భాగంతో ప్రయాణం ప్రారంభం చేసినట్లయితే తప్పకుండా కైవల్యం లభిస్తుందని ,ఈ భూమితో ఉండే ఆకర్షణ సంబంధిత సంబంధాలన్నీ కూడా తొలగిపోయి ఆ శ్రీమన్నారాయణ మూర్తిని చేరుకుంటాము అని తెలిపారు. భవ బంధనాలన్నీ కూడా తొలగిపోతాయి. అనేటటువంటి రహస్యాన్ని కనుగొన్న ప్రాచీనులు ఈ అంశాలన్నీ కూడా శాస్త్రోక్తంగా చెప్తే అందరికీ అర్థం అవుతాయో లేదో అనే ఉద్దేశ్యంతో కథలను జోడించి విభీషణ శరణాగతి కథ, వైకుంఠ ఏకాదశి కథ, ముప్పది మూడు కోట్ల దేవతలతో ఆ స్వామి ము కోటిఏకాదశి నాడు మనకు దర్శనమిస్తాడు. మూడు కోట్లతో రంగధాముని దర్శనమిస్తాడు. ఇలా చెప్పి ఆలయాలవైపు మనల్ని మరల్చారు. స్వామి దర్శనం చేసుకోండి అంటూ అనుజ్ఞనిచ్చారు. మన ప్రయత్నం కాకుండా గురువుతో ప్రయత్నం కావాలి. స్వప్రయత్నం కూడదు అంటుంది ధర్మము. కాబట్టి నారాయణుడే అటువంటి మనలో జ్ఞానమును ప్రేరేపించు వాడు. ఆయన ప్రపన్నుడు కావాలని ముక్కోటి ఏకాదశి నాడు దేవాలయాలకు వెళ్ళమంటారు అడిగిన వాళ్ళందరికీ కూడా ఆశ్రయం ఇచ్చే ప్రపన్నుడు. ఎవరిని రక్షించాలా,అని సంసిద్ధుడై ఉంటాడుట. కాబట్టి ఉత్తర ద్వార దిశగా మనం ప్రయాణం చేస్తే తప్పకుండా కోరిన కోరికలు నేరవేరుతాయని తెలిపారు. అన్నింటికంటే కోరవలసినది ఏమున్నది ఈ లోకంతో భవ బంధనాలనుంచి విముక్తి. మోక్షము అంటే "ముచిల్ మోక్షణే" అని అర్థం. బంధనాలనుంచి ముక్తిని పొందడము, విముక్తిని కలిగించుకోవడము అని అర్థం. అందుకే ఉత్తర దిశ ఇంత ప్రాముఖ్యం కలది అని తెలిపారు. వివిధ దేవాలయాలలో జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు మహిళారపు లింబాద్రి, మహా జాన్ నరసింహులు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, వెంకటేశ్వర్లు, మంచాల రాజ్ కుమార్, అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అలుపెరుగని మండల స్థాయినేతను అక్కున చేర్చుకున్న భాజాప

**కరపత్రం జనవరి 10.**

నిన్న జరిగిన భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుల ఎన్నికల్లో మల్లాపూర్ మండల అధ్యక్షుడిగా గోపిడి శ్రీనివాసరెడ్డిని రెండోసారి అధిష్టానం ఏకగ్రీవంగా ఎంపిక చేసింది ఇట్టి నియామకం పట్ల మల్లాపూర్ మండల భాజపా శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి అలాగే ఒక స్థాయి కార్యకర్త నుండి ఎంతో ఒదిగి ప్రజలతో మమేకమై అహర్నిశలు కష్టపడి ఎన్డీఏ సర్కార్ యొక్క విధి విధానాలు అలాగే మోడీ హయాంలో జరుగుతున్న ప్రభుత్వ పథకాలను అన్ని రకాల వర్గాల వారికి చేర వేయడంలో అహర్నిశలు శ్రమించారు అలాగే భారతీయ జనతా పార్టీ క్రియాశీల సభ్యత్వాలను కోరుట్ల నియోజకవర్గంలోనే మల్లాపూర్ మండలాన్ని ప్రప్రథమంగా నిలిపారు ఇంతటి



గురుతరమైన బాధ్యతను తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలను అప్పగించినందుకు కేంద్ర మంత్రివర్యులు తెలంగాణ రాష్ట్ర భాజపా అధ్యక్షులు గంగవరపు కిషన్ రెడ్డి అలాగే నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ జిల్లా కమిటీ అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి వద్దేపల్లి శ్రీనివాస్ కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గార్లకు అలాగే మల్లాపూర్ మండల బూత్ అధ్యక్షులు శక్తి కేంద్ర నిర్వాహకులకు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు ఇకనుండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ వచ్చే స్థానిక సంస్థ గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని మండలంలోఅగ్రస్థానంలో నిలబెడతారని వారి బాధ్యతలు స్వీకరించారు


# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ &కొమిరిశెట్టి ఫౌండేషన్

## ముత్యాల ముగ్గుల పోటీలు

**శేరిలింగంపల్లి జనవరి 10 కరపత్రం**

మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కారించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో గల 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ మరియు 5 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుంది. దీనిలో భాగంగా ఈరోజు శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్ పరిధిలో గల విద్యానికేతన్ మోడల్ హైస్కూల్ నందు విద్యార్థినులకు మరియు అధ్యాపకురాళ్ళకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. విజేతలకు బహుమతి ప్రదానం చేసిన అనంతరం కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవులు మాట్లాడుతూ " పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు" అని అన్నారు. " ఈ పోటీల వలన మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి అవకాశం ఉంటుంది. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తరువాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయి. నేటి యువతరం మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించేందుకై ఈ పోటీలు నిర్వహిస్తున్నాము" అని అన్నారు. " ఈ ముగ్గుల వలన పరిసరాలు పరిశుభ్రతగా ఉంటాయి. గోమయంతో కళ్ళాపి జల్లి బియ్యపు పిండితో ముగ్గులు వేయడం వలన బియ్యపు పిండి తినడానికి చీమలు చేరతాయి. ఆ విధంగా చీమలు క్రిమి కీటకాదులు ఇంటి లోనికి రాకుండా అడ్డుకుంటాయి. ఈ ముగ్గులు వేసే ప్రక్రియలో మహిళలు అనేక శరీర భంగిమలలో పనిచేయవలసి ఉటుంది. ఈ వ్యాయామ ప్రక్రియ వలన మహిళలలో అనేక గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండేందుకు అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. కావున ప్రతి మహిళ కూడా ప్రత్యేకించి ఈ ధనుర్మాసం మొత్తం నెలరోజులు అత్యంత ఉత్సాహంగా వేకువ ఝామున లేచి ముగ్గులు వేయడం ప్రారంభిస్తారు" అని అన్నారు. ఈ పోటీలలో 25 మరియు 30 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కనకదుర్గ, అధ్యాపకురాలు సత్యవతి, కరస్పాండెంట్ రామాచారి మరియు అలాగే ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జంప్‌డ్ డిపాజిట్" పేరుతో యూపీఐ లో నేరగాళ్ల కొత్త స్కాం







**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సైబర్ నేరాలపై ప్రజలకు అప్రమత్తత కల్పిస్తూ, ఎప్పటికప్పుడు అవగాహన చేస్తున్న విషయం తెలిసిందే.ఈ క్రమంలో ఆయన తాజాగా ఒక ట్వీట్ చేశారు. "జంప్‌డ్ డిపాజిట్ స్కామ్" పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలను జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు.ఈ సందేశంలో భాగంగా, సజ్జనార్ ఒక వీడియోను పోస్ట్ చేసి, స్కామ్ గురించి వివరించారు.ఈ వీడియోలో ఆయన ఈ విధంగా చెప్పారు: "మీకు తెలియని వ్యక్తుల నుంచి యూపీఐ ద్వారా డబ్బులు మీ ఖాతాలో జమైతే, ఆ డబ్బులను చూసేందుకు బ్యాలెన్స్ చెక్ చేస్తూ, పిన్ ఎంటర్ చేస్తే, మీ ఖాతా ఖాళీ అవుతుంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు




**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి మేడ్చల్ నియోజక వర్గం**



మేడ్చల్ నియోజకవర్గం శామీర్ పేట్ మండలం అలియాబాద్ చౌరస్తాలో వైకుంఠ ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రత్నాలయంలో శు క్రవారం నిర్వహించిన వైకుంట ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రత్నాలయంకు వచ్చిన భక్తులు ఉత్తర ద్వారం నుండి స్వామి వారిని దర్శించుకున్నారు.

# జగిత్యాల ఓల్డ్ హైస్కూల్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి పతకాలు



**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**


గత నెల లో జగిత్యాల లో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్పులో ఓల్డ్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థాయిలో నెగ్గి రాష్ట్ర స్థాయికి ఎంపికై డిసెంబర్ నెల 27వ తేదీన హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలలో స్విమ్మింగ్ లో పదవ తరగతి చదువుతున్న ఎన్ చంద్రమోహన్ ద్వితీయ స్థానం(రజత పతకం ) బాక్సింగ్ లో 9వ తరగతి చదువుతున్న వి అఖిల్ తృతీయ స్థానం( కాంస్య పతకం) పొందడం పట్ల విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి చంద్రకళ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు బోయిని పెల్లి ఆనందరావు ఉపాధ్యాయులు సూర్యప్రకాష్ శ్రీనివాస్ సురేందర్ మల్లికార్జున్ సంజీవయ్య పద్మ విద్యా దేవి హరిత అరుణ రజిని అభినందించారు.

# ఆర్ఓబి వద్ద తారు రోడ్డు పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్..

**కరీంనగర్ జనవరి 10 కరపత్రం**

కరీంనగర్ తీగల గుట్టపల్లి ఆర్ఓబి వద్ద తారు రోడ్డు పనులను శుక్రవారం రోజున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఆర్ ఓ బి వద్ద జరుగుతున్న నిర్మాణ పనులతో ఆ ప్రాంతం మీదుగా ప్రయాణించే వారి కష్టాలను స్థానిక కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ ఇటీవల కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టి కి తీసుకువెళ్లారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన మంత్రి బండి సంజయ్ రూపాయలు 36 లక్షలతో తారు రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. శుక్రవారం రోజున కార్పొరేటర్ శ్రీనివాస్, స్థానిక నాయకులతో కలిసి మంత్రి బండి సంజయ్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం కరీంనగర్ రైల్వే స్టేషన్ ను సందర్శించారు. ఆర్ఓబి వద్ద ప్రయాణికుల కష్టాలను తీర్చిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కు డివిజన్ పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కార్పొరేటర్ శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలిపారు.

# దేశ నిర్మాణమే మా ప్రధాన లక్ష్యం.. చైర్మన్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ



**కరపత్రం డెస్క్ జనవరి 10:**

90 hour work week ఎ ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని , ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా 'ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు..? ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు? ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలువురు సెలబ్రిటీలు సైతం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ అండ్ టీ చైర్మన్ చేసిన వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. దేశ నిర్మాణమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం అని పేర్కొంది. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా భారతదేశ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్ టీ మెరుగుపరిచిందని వివరించింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసాధారణమైన కృషి అవసరమని పేర్కొంది. ఈ విస్తృత లక్ష్యాన్నే చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయని వివరణ ఇచ్చింది.వారానికి 90 గంటలు పని చేయాలన్న ఎల్అండ్‌టీ చైర్మన్ ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఎల్అండ్‌టీ ఉద్యోగులతో ఇటీవల ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. 'ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంత సేపు ఇంట్లో కూర్చుంటావు? ఎంతసేపు నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు? ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు' అని ఆయన వ్యాఖ్యానించారు.అంతటితో ఆగని సుబ్రహ్మణ్యన్.. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఒక చైనా వ్యక్తితో మాట్లాడానని, చైనా కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు కాబట్టి కొన్ని రోజుల్లో అమెరికాను చైనా దాటేస్తుందని ఆ వ్యక్తి చెప్పినట్టు సుబ్రహ్మణ్యన్ చెప్పుకొచ్చారు. 'మీరు కూడా ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయాల్సిందే. ముందుకొచ్చి పని చేయండి' అని ఆయన పిలుపునిచ్చారు. ఆయనపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలను చిన్నచూపు చూసేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు.

## వారానికి 90 గంటల పని.. ఎల్అండ్‌టీ చైర్మన్ ప్రకటనపై ఘాటుగా స్పందించిన దీపిక పదుకొణె



**కరపత్రం డెస్క్ జనవరి 10:**

ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా 'ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు..? ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు? ' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన వ్యాఖ్యలపై నెట్టింట తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై బాలీవుడ్ స్టార్ నటి దీపిక పదుకొణె సైతం ఘాటుగా స్పందించారు. సుబ్రహ్మణ్యన్ స్టేట్‌మెంట్‌ను సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఇంత ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు ఇలాంటి ప్రకటనలు చేయడం షాకింగ్‌గా ఉంది' అంటూ వ్యాఖ్యానించారు. ఈ పోస్ట్‌కు అనే హ్యాష్‌ట్యాగ్‌ను జోడించింది. తద్వారా మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని దీపిక అభిప్రాయం వ్యక్తం చేసింది.వారానికి 90 గంటలు పని చేయాలన్న ఎల్అండ్‌టీ చైర్మన్ ఉద్యోగులు వారానికి 90 గంటల పాటు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఎల్అండ్‌టీ ఉద్యోగులతో ఇటీవల ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా.. 'ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంత సేపు ఇంట్లో కూర్చుంటావు? ఎంతసేపు నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు? ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగని సుబ్రహ్మణ్యన్.. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఒక చైనా వ్యక్తితో మాట్లాడానని, చైనా కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు కాబట్టి కొన్ని రోజుల్లో అమెరికాను చైనా దాటేస్తుందని ఆ వ్యక్తి చెప్పినట్టు సుబ్రహ్మణ్యన్ చెప్పుకొచ్చారు. 'మీరు కూడా ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయాల్సిందే. ముందుకొచ్చి పని చేయండి' అని ఆయన పిలుపునిచ్చారు. ఆయనపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలను చిన్నచూపు చూసేలా ఆయన మాట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు.

## శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో దిగజారిన భారత్ ర్యాంక్..!

**కరపత్రం డెస్క్ జనవరి 10:**




ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో భారత్ 85వ స్థానంలో నిలిచింది. గత ఏడాది 80వ స్థానంలో ఉండగా.. ఈ సారి ఐదు స్థానాలు దిగజారింది. వీసా రహితంగా ట్రావెల్ చేయగలిగిన గమ్యస్థానాల ఆధారంగా హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2025 ఈ ర్యాంకింగ్స్‌ను ఇచ్చింది. మొత్తం 199 దేశాల్లో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాను ప్రకటించింది. ఈ జాబితా ప్రకారం భారత పాస్‌పోర్టుతో 57 దేశాలకు వీసా లేకుండానే ప్రయాణించే వీలుంది.

ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ఇచ్చిన డేటా ఆధారంగా ఈ ర్యాంక్‌లను ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాలో సింగపూర్ తొలి స్థానంలో నిలిచింది. ఈ దేశ పాస్‌పోర్టు కలిగిన వారు వీసా లేకుండానే 195 దేశాలకు వెళ్లొచ్చు. సింగపూర్ తర్వాత జపాన్ రెండో స్థానంలో నిలిచింది. ఈ దేశ పాస్‌పోర్టుతో వీసా లేకుండానే 193 దేశాలను చుట్టేయొచ్చు. ఇక ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, దక్షిణ కొరియా, స్పెయిన్ దేశాలు మూడో స్థానంలో నిలిచాయి. ఈ దేశాల పాస్‌పోర్టుతో వీసా లేకుండా 192 దేశాలను సందర్శించొచ్చు. ఆ తర్వాత ఆస్ట్రియా (191), డెన్మార్క్ (191) దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

## ల్యాప్‌ట్యాప్‌లు, ప్రింటర్లు.. బ్లింకిట్‌లో ఇక 10 నిమిషాల్లోనే డెలివరీ

**కరపత్రం డెస్క్ జనవరి 10:**




పది నిమిషాల్లో కిరాణా సరుకులను డెలివరీ చేస్తున్న క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ .. తన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ పోర్ట్‌ఫోలియోను విస్తరించింది. కేవలం పది నిమిషాల్లోనే ల్యాప్‌ట్యాప్‌లు, మానిటర్లు, ప్రింటర్ల డెలివరీ సేవల్ని ప్రారంభించింది. ఎంపిక చేసిన నగరాల్లో తొలుత ఈ సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ విషయాన్ని బ్లింకిట్ సీఈఓ అల్బిందర్ దిండ్సా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

'సండేని సన్-డ్యూటీ'గా మార్చాలేమో: 90 పని గంటలపై హర్ష్ గొయెంకా

హెచ్‌పీ కంపెనీ ల్యాప్‌ట్యాప్‌లు, లెనోవా, జీబ్రానిక్స్, ఎంఎస్ఐ నుంచి మానిటర్లు, కెనాన్, హెచ్‌పీ నుంచి ప్రింటర్లను కేవలం 10 నిమిషాల్లోనే డెలివరీ అందించనున్నట్లు కంపెనీ సీఈఓ సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణె, ముంబయి, బెంగళూరు, కోల్‌కతా, లఖ్‌నవూ నగరాల్లో ప్రస్తుతం ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. త్వరలోనే మరిన్ని బ్రాండ్‌లకు చెందిన ప్రొడక్ట్స్‌ను డెలివరీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మినిట్స్ పేరిట ఫ్లిప్‌కార్ట్, బీబీన్యూ పేరిట బిగ్‌బాస్కెట్ ఎలక్ట్రానిక్స్ వస్తువులను నిమిషాల్లో డెలివరీ చేస్తోంది. ఈ నేపథ్యంలో బ్లింకిట్ కూడా ఈ సేవల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.